క్లుప్తంగా

త్వరితగతిన సర్వే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగరపాలక సంస్థ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో కమిషనర్ పల్లి నల్లనయ్య సోమవారం సమావేశమై, వీధి విక్రయదారుల గుర్తింపు సర్వేపై సమీక్ష నిర్వహించారు. సర్వే ఏ విధంగా జరుగుతోంది.. ఏ మేరకు వచ్చింది.. ఏవైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వేలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని సచివాలయ కార్యదర్శులు కమిషనర్‌కు తెలుపగా సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని, సర్వేను శతశాతం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో టీపీఆర్‌వో సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారంలో ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు

డెంకాడ: మండలంలోని గుణపూరు, డెంకాడ ప్రాంతాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత సేవా సమితి, విజయనగరం ఇందూ జ్ఞాన వేదిక సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వక్తలు మాట్లాడుతూ దైవజ్ఞానం ప్రకారం ప్రజలంతా ఒక్కటేనని, భగవద్గీతలోని దైవధర్మాలైన కర్మ, బ్రహ్మ, భక్తి యోగానుసారం నడుచుకుంటే మనిషికి మోక్షం కలుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత వైపు నడవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్షుడు వి.శంకరరావు, ప్రసాద్, వంశీ, రాజేష్, కోటి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో చెత్త వేయవద్దు

విజయనగరం: నగరంలోని మురుగు కాలువల్లో చెత్తాచెదారం వేయవద్దని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. నగరంలోని రింగురోడ్డు, జగన్నాథస్వామి ఆలయం, జమ్ము ప్రాంతాల్లోని ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన మురుగు, చెత్త, పూడికలు జేసీబీలతో తొలగించారు. చిన్న కాలువల్లో చెత్త వేసేయడంతో మురుగునీటి ప్రవాహం సక్రమంగా జరగడం లేదని, తద్వారా కాలువలు నిండిపోయి బయటకు మురుగు ప్రవహించే పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. అలాగే కాలువలపై నిర్మాణాలు చేపడుతున్నారని, దీనివల్ల మురుగు తొలగింపు పనులు కష్టమవుతున్నాయని, ఎవరూ కాలువలపై నిర్మాణాలు చేయరాదన్నారు. ప్రజలు కూడా పొడి, తడి చెత్తలను వేర్వేరు బుట్టల్లో వేసి పారిశుధ్య సిబ్బందికి అందివ్వాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

డెంకాడ: మండలంలోని రాజాపులోవ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఈ నెల 21వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా మోదవలస, గుండయ్యపాలెం, జరజాపుకల్లాలు, బంగార్రాజుపేట, కొండరాజుపేట, చినవల్లూరు, పెదవల్లూరు.. భోగాపురం మండలంలోని పోలిపల్లి, మహరాజుపేట, రాజాపులోవ, చెరుకుపల్లి గ్రామాలకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ అసౌకర్యం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

భూ సేకరణ జీఓను రద్దు చేయాలి

వేపాడ: మండలంలోని కరకవలస పంచాయతీ గిరి శిఖర గ్రామమైన మారికలో భూసేకరణ సామాజిక అధ్యయనంకు సంబంధించి విడుదల చేసిన జీఓను రద్దు చేయాలని ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్, తదితరులు కోరారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ తహసీల్దార్ సన్యాసినాయుడును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగన్, తదితరులు మాట్లాడుతూ.. ఏప్రిల్ 24న కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ జారీ చేసిన నోటిఫికేషన్‌ను గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారన్నారు. సమాజిక అధ్యయనం పేరుతో భూ సర్వే చేపట్టి ప్రైవేట్ కంపెనీలకు భూములు ధారదత్తం చేయడానికి ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. మారిక రెవెన్యూలో జిరాయితీ భూములు 213.8 ఎకరాలతో పాటు అటవీ హక్కుల పొందిన పట్టా భూముల్లో గిరిజనులు పంటలు పండించుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారని చెప్పారు. గ్రామస్తుల భూములను ప్రైవేట్ కంపెనీలకు కట్టబెడితే చూస్తూ ఊరుకోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాత బోయిన పెంటమ్మ, పోరాట కమిటీ నాయకులు జలారి వీర్రాజు, అప్పలనాయుడు, శ్రీను, అర్జున్, ఆసు, బుజ్జిబాబు, దేవుడు, శోభన్‌బాబు, రమేష్, దేముడు, తదితరులు పాల్గొన్నారు.

మాటిచ్చారు.. ఫ్యాక్టరీ తెరిపించండి..



మాట్లాడుతున్న లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ

విజయనగరం గంటస్తంభం: ఎన్నికల ప్రచారంలో భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని మాట ఇచ్చారని, ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఫ్యాక్టరీని తెరిపించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. పీఎఫ్, గ్రాట్యుటీ బకాయిల నిమిత్తం అదే ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల వద్దకు ఆయన సోమవారం వెళ్లి, మద్దతు పలికారు. జిల్లాలో అత్యంత కీలకమైన ఈ భీమసింగి ఫ్యాక్టరీ మూతపడి ఐదేళ్లు కావస్తున్నా ఇప్పటివరకుక కార్మికులకు రావాల్సిన పీఎఫ్, గ్రాట్యుటీలు యాజమాన్యం చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. ఎన్నికల ప్రచారానికి వచ్చేటప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఫ్యాక్టరీ తెరిపిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మంత్రి నారా లోకేష్ కూడా ఇదే మాట ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఫ్యాక్టరీ తెరిచివేతపై అసెంబ్లీలో చర్చకు తీసుకువచ్చినా ప్రభుత్వంలో కదలిక లేదన్నారు. ప్రభుత్వం తన నిర్ణయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులంతా ఫ్యాక్టరీ తెరిచివేతకు సిద్ధం కావాలన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఇదే ఫ్యాక్టరీని తెరిపిస్తే ఎంతోమందికి ఉపాధి కల్పించినవారవుతారన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నేతలు ఉంగరాల శ్రీను, రౌతు కనకరాజు, పిన్నింటి కృష్ణ, మిడతాన దేవుడు, చిన వెంకటరావు, అబ్బాస్, వర్మ తదితరులు పాల్గొన్నారు.

విప్లవయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య



జోహార్..పుచ్చలపల్లి సుందరయ్య అని నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు, తదితరులు

పూసపాటిరేగ: మండల కేంద్రంలో కమ్యూనిస్టు నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఆయన పోరాటాలకు గుర్తుగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సూర్యనారాయణ తదితరులు కలిసి ఎర్రజెండా ఎగురవేసి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సుందరయ్య సేవలు కొనియాడారు. తన జీవితాన్నంతా ప్రజాసేవకే అంకిత చేసిన మహోన్నత నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని, ఆయన పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలని కోరారు. ఆయన తరహాలోనే సమాజంలోని వివక్ష, అంటరానితనం, అసమానతలు రూపుమాపేందుకు ఐక్యంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో కార్మికసంఘం నాయకులు కె. అప్పలనారాయణ, పి.రాజబాబు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మామిడి ఫలసాయం వేలంపాట

పూసపాటిరేగ: మండలంలోని పెదబత్తినివలస గ్రామ మామిడితోటల ద్వారా వచ్చిన ఫలసాయానికి సంబంధించి మంగళవారం వేలంపాట నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు తాడ్డి గోవింద ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. సర్వే నంబర్లు 44-18, 44-2, 44-3, 45-1, 45-2, 46-1, 46-2, 46-4, 46-5, 46-6ల్లోని మొత్తం 28.15 విస్తీర్ణంలోని పంటకు మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో వేలంపాట నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంపాటలో పాల్గొని, ఫలసాయం దక్కించుకోవాలని ఆయన కోరారు.

నెలాఖరులోగా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

విజయనగరం: నగర పరిధిలోని నిరుపేదల గృహ నిర్మాణాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయించి, గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు ఆయన నగరంలోని తన కార్యాలయంలో గృహ నిర్మాణ సంస్థ అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదల ఇళ్ల నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. రాష్ట్రంలో 3 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందన్నారు. ప్రతి లబ్ధిదారునికి నిర్మాణానికి అదనంగా రూ.50 వేల సాయం అందివ్వడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి, వారితో నిర్మాణాలు పూర్తి చేయించాలని కోరారు. సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ డీఈ జీవీ రంగారావు, ఏఈ కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రాట్యుటీ చెల్లించేలా చర్యలు తీసుకోండి

నెల్లిమర్ల: లేబర్ కోర్టు తీర్పు మేరకు రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు మైపాడ ప్రసాద్ కోరారు. ఇదే విషయమై ఆయన సోమవారం కలెక్టరేట్‌కు వెళ్లి, అధికారులకు విన్నవించారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఆదేశాల మేరకు గ్రాట్యుటీ ఇప్పించాలన్నారు. 2023లో గ్రాట్యుటీ చెల్లింపులు చేయాలని యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసినా ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. రెండు రోజుల్లోగా సమస్య పరిష్కారం కాకపోతే తాము చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు కథల పోటీలు

విజయనగరం టౌన్: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక గురజాడ స్వగృహంలో విద్యార్థులకు శతక పద్యాలపై అవగాహన, నీతికథలపై పోటీలు సోమవారం నిర్వహించారు. వాగ్దేవి సమారాధనం, తెలుగు భాషా పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ తరగతులు విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్ అందించేలా ఉండాలని వాగ్దేవి సమారాధనం సంస్థ వ్యవస్థాపకులు పెన్నేటి స్వప్నహైందవి అన్నారు. విద్యార్థులు కూడా కొత్త విషయాలు నేర్చుకునేందుకు ఉత్సుకత కనబరచాలన్నారు.

దేశీ వరి సాగుపై అవగాహన

విజయనగరం ఫోర్ట్: స్థానిక శిక్షణ కేంద్రంలో దేశీ వరి సాగుపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. సాగు పద్ధతులు, అధిక దిగుబడుల సాధనకు అనుసరించాల్సిన విధానాలను ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ ఎం.ఆనంద్‌రావు వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించి, పంటలు పండిస్తే నాణ్యమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

నెల్లిమర్ల: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మహాసభలను విజయవంతం చేయాలని ఏపీజీఈఏ నెల్లిమర్ల తాలూకా యూనిట్ అధ్యక్షుడు పి.వీరన్న కోరారు. స్థానిక సబ్‌ట్రెజరీ కార్యాలయం వద్ద సభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు 11 వేతన సంఘం కమిటీ నియమించాలని, డీఏ బకాయిలు విడుదల చేయాలని కోరారు. వచ్చే నెల 5వ తేదీన జరిగే సభలకు అందరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ గౌరవాధ్యక్షుడు జి.చక్రవర్తి, ఉపాధ్యక్షురాలు పద్మ తదితరులు పాల్గొన్నారు.



గజపతినగరం మార్కెట్

మార్కెట్‌యార్డులో.. సౌకర్యాలు కరువు

- అద్దె ప్రాతిపదికన దుకాణాల కేటాయింపు
- అయినా కొంతమంది పాత దుకాణాల్లోనే వ్యాపారం
- బేరాల్లేక ఇబ్బంది పడుతున్న రైతులు
- మరుగుదొడ్లకు తాళాలు



ఖాళీగా ఉన్న షాపులు



తాళం వేసి ఉన్న మరుగుదొడ్డి

గజపతినగరం రూరల్: గజపతినగరం మార్కెట్ యార్డులో కొత్త దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారులకు కేటాయించినా బేరాల్లేక ఇబ్బంది పడుతున్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో వినియోగదారులు కూడా కొనుగోలుకు ముందుకు రావడం లేదు. వాస్తవానికి ఈ ప్రాంతంలో సుమారు 50 రైతు కుటుంబాలు కూరగాయలు విక్రయించుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నాయి. అయితే ఇటీవల స్థానిక గజపతినగరం పంచాయతీ అధికారులు శాశ్వత మార్కెట్ షెడ్‌లను ఏర్పాటు చేసి 32 షాపులను వ్యాపారులకు కేటాయించారు. ఇందులో పది కూరగాయల షాపులు, కిరాణా దుకాణాలు రెండు, మూడింటిలో ఉల్లిపాయలు, మరో మూడింటిలో చేపల విక్రయాలు, టైలర్లు మూడు దుకాణాల్లో ఉంటుండగా.. మిగతావి ఖాళీగా ఉన్నాయి. ఈ దుకాణాలకు సంబంధించి ఒక్కొక్కరి నుంచి రూ. ఐదు వేల డిపాజిట్‌తో పాటు వెయ్యి రూపాయల అద్దె వసూలు చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఇందులో కేవలం పది మంది మాత్రమే షాపులు తెరుస్తున్నారు. మిగిలిన వారంతా పాత దుకాణాల్లోనే వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారు. దీంతో వినియోగదారులు కొత్త దుకాణాల వద్దకు రావడం లేదు. మార్కెట్ ప్రారంభంలో ఉన్న పాత దుకాణాల వద్దే వినియోగదారులు ఉండిపోతున్నారని, దీంతో తమకు బేరాలు ఉండడం లేదని కొత్త దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కానరాని సౌకర్యాలు

వేలల్లో డిపాజిట్లు, ప్రతి నెలా అద్దె తీసుకుంటున్న పంచాయతీ అధికారులు సంబంధిత వ్యాపారులకు సౌకర్యాలు కల్పించడంలో శతశాతం విఫలమయ్యారు. మార్కెట్ యార్డులో కనీస అవసరాలైన తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు లేవు. కనీసం ధరల పట్టిక కూడా ఏర్పాటు చేయలేదు. అలాగే మార్కెట్ చుట్టూ చెత్తాచెదారాలతో పేరుకుపోవడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది.

● వెండిమబ్బుల సోయగం..!



నెల్లిమర్లం మండలం, రామతీర్థం పుణ్యక్షేత్రం కొండపై సోమవారం పరుచుకున్న వెండిమబ్బుల అందాలు కనువిందు చేశాయి. మబ్బుల నడుమ ప్రకృతి సోయగం మరింత రెట్టింపు అయింది. ఇది కశ్మీరా..లేక.. యూరప్‌లోని ఏదైనా సుందర పర్యాటక ప్రాంతమా అనేంతలా పర్యాటక ప్రియులను మంత్రముగ్ధుల్ని చేసింది. ఈ ప్రకృతి రమణీయతను పలువురు తమ స్మార్ట్‌ఫోన్లలో బంధించగా, మరికొంతమంది ఫొటోలు దిగి ఆనందించారు. -నెల్లిమర్ల రూరల్





తిరంగా యాత్ర

కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడికి ప్రతీకార చర్యగా భారత్ సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతాన్ని హర్షిస్తూ నెల్లిమర్ల మండల కేంద్రంలో సోమవారం తిరంగా యాత్ర చేపట్టారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజులు పాల్గొని, కాసేపు మాట్లాడారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు భారత్ చేసిన చర్యను యావత్తు ప్రపంచం చూసి మెచ్చుకుందని, సైనికులకు తమ సంఘీభావమన్నారు. పాకిస్థాన్ కుట్రలు, కుతంత్రాలు మనల్ని ఏమీ చేయలేవన్నారు. ఉగ్రవాదులు ప్రపంచంలో ఏ మూల దాక్కున్నా వారిని తుదముట్టించాలన్నదే ప్రధాని మోదీ సంకల్పమన్నారు. సైనికులకు ప్రజల మద్దతు కూడా అవసరమన్నారు. కార్యక్రమంలో నగరపంచాయతీ చైరపర్సన్ బంగారు సరోజిని తదితరులు పాల్గొన్నారు. -నెల్లిమర్ల



ఇదేం..చెత్త పని?

ప్రజారోగ్యాన్ని పరిరక్షించాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనడానికి నిదర్శనంగా నిలుస్తోందీ..చిత్రం. విజయనగరంలోని ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేటప్పుడు కనీస జాగ్రత్తలు పాటించడం లేదు. ట్రాక్టర్లలో లోడు చేసిన చెత్త ఎగరకుండా పైన వలలు కప్పాల్సి ఉండగా, అవేమీ లేకుండా ఇలా తరలిస్తున్నారు. ఆ వాహనం వెనక వెళ్లే మిగతా వాహనదారులంతా దుర్వాసన భరించాల్సి వచ్చింది. ఇదిలా ఉంటే ఒకవేళ గాలి వీచి, చెత్త ఎగిరిపోతే ఏం చేస్తారని వాహనదారులు నిలదీస్తున్నారు. -విజయనగరం

శాంతిభద్రతల్లో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న జైభీమ్‌రావ్ పార్టీ నాయకులు

నెల్లిమర్ల రూరల్: రాష్ట్రంలో శాంతిభద్రతలు సక్రమంగా అమలు చేయడంలో ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందని జైభీమ్‌రావ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టొంపల నరసయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు విమర్శించారు. ఇదే విషయమై వారు మండల పరిధిలోని సతివాడ గ్రామంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. తిరుపతి జిల్లా, చంద్రగిరి సమీపంలోని ఓ కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్న జేమ్స్ అనే దళిత విద్యార్థిపై జూనియర్ విద్యార్థి రౌడీషీటర్లతో దాడి చేయించడం చాలా బాధాకరమన్నారు. కిడ్నాప్ చేయడమే కాకుండా మూత్రాన్ని కూడా తాగించడం తమని కలిచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుడిగా పుట్టడమే ఆ విద్యార్థి చేసిన నేరమా? అని ప్రశ్నించారు. ఉన్నత విద్యాసంస్థలోనే ఇలాంటి అమానవీయ, అవమాన ఘటన జరగడం దారుణమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి దళితులు, ఆదివాసీలకు రక్షణ కరువైందని, శాంతిభద్రతలను అదుపులో ఉంచడంలో సర్కారు చేతులెత్తేసిందని ధ్వజమెత్తారు. జరిగిన ఘటనపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌లు తక్షణమే స్పందించాలని, బాధితుడికి న్యాయం జరిగేలా చూడాలన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతులు



వినతులు స్వీకరించి, సమస్య వింటున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి పలువురు తమ సమస్యల పరిష్కారానికి వినతులు సమర్పించారు. కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు.